# కర్ణాట కలహం

మధ్యాహ్నం 12 గంటలు. గోదావరి స్టేషన్‌లో రైలు దిగి మెయిన్ రోడ్డుమీద వస్తున్నాను.

"గంధర్వకళ - తియ్యని లేహ్యము" అనే ప్రకటనాక్షరాలు కనబడ్డాయి. గదిలో కలకలం, తిరిగి చూశాను, ఇంకేముంది? శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మందుల కొట్టు!

ఇంటినుంచి బజారులోకి ఎప్పుడు తరలించారా? అని ఆశ్చర్యపడి చూస్తూండగా—

"రండి, రండి, అలా చూస్తారేం? ఇది మన ఆశ్రమం. మన అంతరంగం. చిన్నకథ లయితే, బహిరంగం ఈ మందులూ, ఆసవాలూ, అరిష్టాలూనూ" అంటూ శాస్త్రిగారు అరుగుమీదకి వచ్చారు.

"స్వాగతం, సుస్వాగతం" నవ్వులూ పిలుపులూ - మెట్లెక్కి లోపలికి వెళ్ళదునుగదా – అక్కడ సభాస్తారులు భమిడిపాటి కామేశ్వర రావుగారు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు, పి. గణపతిశాస్త్రిగారూను.

ఇది మందులకొట్టా? సాహిత్య దుకాణమా?

శాస్త్రిగారు కుశలసంప్రశ్నలు వేస్తూనే వున్నారు.

"ట్రే"లో ఐదు కాఫీలు సాక్షాత్కరించాయి.

"సంగీతము మరగి జేరసారము లుడిగెన్" అన్న మాట జ్ఞాపకం వచ్చి నవ్వుకుంటూ ఒక కప్పు స్వీకరించాను. ఇంతట్లో యెవరో ఒక పల్లెటూరాయన "దాక్షారిష్టం వుందండీ?" అంటూ అరుగుమిదకు వచ్చి మా కాఫీకలాపం చూచి బిత్తరపడి నిలబడిపోయాడు పాపం! శాస్త్రిగారివి పాము చెవులు, పేరుకు తగ్గట్టు.

మేము కబుర్లు చెప్పుకుంటూనే వున్నాం.

శాస్త్రిగారు యెప్పుడు బీరువా తెరిచారో, యెప్పుడు సీసా తీశారో– ద్రాక్షారిష్టం ఇచ్చి డబ్బు పుచ్చుకుని మా దగ్గర చప్పుడు కాకుండా చదికిల బడ్డారు.

ఒక చేతితో తియ్యని కథలూ, ఇంకో చేత్తో ద్రాక్షాష్టం, అందజేసే ఆంధ్ర సవ్యసాచి ఆయన—

భమిటిపాటివారు నేత్రావధానంతోటే మెప్పు ప్రకటించి సంగ్రామం కొనసాగిస్తున్నారు.

గోపాలకృష్ణమూర్తిగారు బూరావంటి కంఠంతో తన అధ్యయనం సాగిస్తున్నారు.

పోస్టుమేన్ ఒక పీమకాగితాల మాసపత్రిక తెచ్చి శాస్త్రిగారి కిచ్చాడు. అది, ఆ మధ్య ఒక యువకుడు ఏమీ పనిలేక పెట్టిన "సాహిత్యం 'కమ్' సమాజం" పేపరు.

కామేశ్వరరావుగారు రేపరు చింపి పేపరు తిరగేస్తున్నారు. గోపాల కృష్ణమూర్తిగారు పని ఉందంటూ వెళ్ళిపోయారు.

కామేశ్వరరావుగారు నవ్వుతూ, "ఎవరో మీమీద దాడి చేస్తున్నారండోయ్" అంటూ పేపరు గణపతిశాస్త్రికి ఇచ్చారు. అతడు పరికించి నా చేతి కిచ్చాడు. ఇంతకీ అందులో ఏ ముందంటే — "నేటి పండితులకు పరిజ్ఞానం పూజ్యం, అవగాహన శూన్యం" ఇత్యాదిగా మా మీద అక్షింతలు.

గణపతిశాస్త్రి హేళనగా నవ్వి పెదవి విరచి, ఊరుకున్నాడు. ప్రతి వాడి వాగుడికీ జవాబు ఏమిటి ? అన్నట్టు. అప్పటికే అతడు ఒక ద్రోణాచార్యునితో తలపడి ధనుష్టంకారం చేస్తున్నాడు. దీన్నంతగా పట్టించుకోలేదు.

నాకు మునిమాణిక్యం చెప్పిన కథ ఒకటి జ్ఞాపకం వచ్చింది ! ఒక బి. ఏ. బి. ఇడి. గారు హెడ్మాష్టరీ ఇంటర్వ్యూకు వెళ్ళారట. ఆ లో పరీ

షలో (ఇంటర్వ్యూ) "మాష్టారూ మీరు ఇంగ్లీషు. లెక్కలు, హిస్టరీలలో ఏది బాగా చెప్పగలరు?" అని ప్రశ్నించేరట. వెంటనే ఈయన 'ఏమీ చెప్పలేనండీ' అన్నాడు.

"అయితే ఎందుకు వచ్చినట్టు?"

అని వారు ముదలకిస్తే బి.ఇడి. గారు అన్నారట— "ఏమీ చెప్ప లేను గనకనే హెడ్మాష్టరీకి వచ్చాను!" అని లేచి వెళ్ళిపోయాడట.

అట్లా "ఎందులోనూ చెయ్యి సాఫుగా సాగకనే ఆయన పత్రిక పెట్టి కీర్తి, ధన సంపాదకుడై" దర్జాగా పత్రిక నడుపుతున్నాడన్నాను నవ్వుతూ. కామేశ్వరరావుగారు మాంచి లోకజ్ఞులు— నిదానంగా మా వేపు చూచి ప్రారంభించారు.

"పండితులను వెటకారం చెయ్యడం ఈనాటి ఫాషన్. మనకు ఏదిలేదో అది వున్నవారిమీద అసూయ తెలియకుండానే పుట్టుకు వస్తుంది. ఈ నాడు ప్రబంధాల్ని తిట్టేవారంతా ముందు అవి అర్థంకాక— తర్వాత సామాజిక స్పృహ, ప్రజావళి, అవగాహన అనేవి పడికట్టు రాళ్ళు. ఆధునిక పరిజ్ఞానానికీ, సదవగాహనకీ, పండితుడవడం అడ్డురాదు. అవి విలక్షణమైన చిత్త సంస్కారంవల్ల ఏర్పడతాయిగాని చదువుకున్న భాషవల్ల కాదు. ఇంకో చమత్కారం వుంది.

ఈ పిచు కాగితాల పత్రికక్కూ గుర్తింపు కావాలి." దాని కొక ఘర్షణ లేవదియ్యాలి. మీ వంటివారు రంగంలోకి దిగితే యింక వారికి కావలసిందేమిటి? నాన్‌రొట్టె విరిగి కాఫీలో పడిందన్నమాట! మీరు దాని వుచ్చులో యిరుక్కోవడం ఖాయం, ఇంకా దానికి యెక్కడ లేని ప్రచారం వస్తుంది. మీరు గడుసువారైతే ఒక పని చెయ్యాలి. దాన్ని దాని

రాతల్నీ ఖాతర్ చెయ్యకుండా రచనల్ని జోరు చెయ్యండి. మీ పరిజ్ఞానం యెంతటిదో, మీ అవగాహన యేమిటో రుజువు చెయ్యండి. బస్. అదే దానికి జవాబు."

నిజానికి గణపతిశాస్త్రిగారు కర్ణాట కలహంలో (కోరి పోట్లాడడం) యిరుక్కోవడం నా కిష్టంలేదు. వెంకటశాస్త్రి గారికి కవిత్వం తెలియకా, గణపతిగారి గేయంలో కవిత్వం లేకా ఆయన గ్రంథం పెంచడం లేదు. ఒక యువకుడివల్ల ఆయన తిరస్కారం భరించలేరు. ఆయన వెనక కావలసినంత వయస్సు, ప్రతిష్టా. వున్నాయి.

ఆయన మాటంటే గుడ్డిగా 'రైట'నుకునే జనం ఉన్నారు. దీనితో వెంకటశాస్త్రి గారికి పోయేదేమీ లేదు.

నష్టం గణపతిగారికి. ఈయన సృజనాత్మక రచనాభోగం దెబ్బతింటుంది. ఈ కలహావాఙ్మయం నిలవదు. రామకృష్ణులు గొప్ప కవులు. తరగని సాహిత్య వివాదంలో చాలా నష్టపోయారు.

కామేశ్వరరావుగారి దూరదృష్టి మా కెంతో నచ్చింది. ఒకప్పుడు కృష్ణశాస్త్రిగారు ఉమాకాన్తంగారి విమర్శగురించి మాట్లాడుతూ వ్యంగ్యంగా- "వారు మహాపండితులూ! వారికి మే మేం జవాబు చెప్పగలం? మరింత జోరుగా, రెట్టింపు ఉత్సాహంతో వ్రాయడమే వారికి తగిన జవాబు !" అన్నారు.

ఫలితం : ఆ విమర్శ బుట్టదాఖలా అయింది.

నవ్య కవిత్వం జెండా యెగరేసింది!

సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తాళంచెవులు సవరిస్తూ లేచారు. అది కొట్టుమూసే వేళయిందని చెప్పడానికి ధ్వని ప్రధాన కావ్యం. ●